## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కేజీబీవీ విద్యార్థులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి నజీమ్ పటేల్

అల్లాదుర్గం, డిసెంబర్ 5: గురుకులంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి నజీమ్ పటేల్ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ అవుతుండడంతో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపు మేరకు, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఆదేశాలతో బీఆర్ఎస్వీ గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా గురువారం కేజీబీవీని సందర్శించారు. భోజనాన్ని పరిశీలించారు. కూరగాయలు, వంటగదిని పరిశీలించారు. భోజనం, డ్రింకింగ్ వాటర్, విద్యార్థుల యూనిఫామ్స్, దుప్పట్లు, కాస్మోటిక్స్ సకాలంలో అందుతున్నాయా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ గురుకుల సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందక ఎంతో మంది అస్వస్థతకు గురై దవాఖానల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి వద్ద తల్లిదండ్రులు తమ పిల్లలు ఎలాంటి ఆహారం తింటున్నారో అని బిక్కుబిక్కు మంటూ ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థులకు నాణ్యమైన సరుకులు, కూరగాయలు, శుభ్రమైన నీరు, ఆహారం అందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఉద్ది నాగరాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహులు, నాయకులు కృష్ణాగౌడ్, కార్తిక్, లతీఫ్, సాయికుమార్, దశరథ్ పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి

**- కలెక్టర్ రాహుల్‌రాజ్**

మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, డిసెంబర్ 5: మహిళా సాధికారత లక్ష్యంగా ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో టీఎస్ ఆర్టీసీ ఎండీ సురేఖ ఆధ్వర్యంలో మహాలక్ష్మీ పథకం అమలుపై కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు ఆధార్‌కార్డు ద్వారా కోటి 60 లక్షల మంది జీరో టికెట్ కొని ఉచితంగా ప్రయాణించారన్నారు. ఆర్టీసీకి భారం అయినప్పటికీ సేవలు అందించడం అభినందనీయమన్నారు. డ్రైవర్, కండక్టర్ బాధ్యతగా మెలిగి ప్రయాణికులతో మమేకమవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ నీరు రాక మహిళల అవస్థలు

మిషన్ భగీరథ నీటి పైప్‌లైన్ కట్ కావడంతో ఒకే దగ్గర నీళ్లు పట్టుకుంటున్న ప్రజలు

శివ్వంపేట, డిసెంబర్ 5: మండలం పోతులబొగుడ గ్రామంలోని ముదిరాజ్, ఎస్సీ కాలనీల్లో మిషన్ భగీరథ నీరు రాక కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. పైప్‌లైన్ కట్ కావడంతో ఆ కాలనీలో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా అధికారులు మూసి వెళ్తున్నారే తప్పా సమస్యకు పరిష్కారం చూపడం లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిషన్ భగీరథ తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

పీహెచ్‌సీ పరిసరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీరామ్

శివ్వంపేట, డిసెంబర్ 5: ప్రభుత్వ దవాఖానకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని శివ్వంపేట (డీపీ హెచ్) డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రవీందర్‌నాయక్ అన్నారు. గురువారం డీఎంహెచ్‌వో శ్రీరామ్‌తో కలసి శివ్వంపేట పీహెచ్‌సీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. దవాఖాన పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సృజన, మండల వైద్యాధికారిని డాక్టర్ సాయి సౌమ్య, డాక్టర్లు పవన్, మౌనిక, శైలేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

## సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

చిన్నశంకరంపేట, డిసెంబర్ 5: సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని మండల జాక్ అధ్యక్షుడు ప్రతాప్ తెలిపారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, రాష్ట్ర వ్యాప్తంగా 10వతేదీ నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఎంఈవో పుష్పవేణికి సమ్మె పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, సందీప్, కవిత, అమృత రాణి, దామోదర్, లక్ష్మీ పాల్గొన్నారు.

**అల్లాదుర్గంలో..**

అల్లాదుర్గం, డిసెంబర్ 5: మండలంలోని సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంఈవో ధనుంజయకు గురువారం వినతి పత్రం అందజేశారు. కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న తమను రెగ్యులర్ చేస్తూ వేతన స్కేలు అమలుచేయాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో రమేశ్, ఈశ్వర్, వెంకట్ తదితరులు ఉన్నారు.

## అడవుల పరిరక్షణకు కృషి చేయాలి

అవగాహన కల్పిస్తున్న తూప్రాన్ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ అంబర్ సింగ్

చేగుంట, డిసెంబర్ 5: అడవుల పరిరక్షణకు కృషి చేయాలని తూప్రాన్ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ అంబర్ సింగ్ పేర్కొన్నారు. మండలంలోని పోలంపల్లి, వడియారం రిజర్వు ఫారెస్టులో విద్యార్థులతో కలిసి పర్యటించి అడవులు, చెట్ల ద్వారా సమాజంలోని మానవాళికి ఉపయోగపడే వాటిపై అవగాహన కల్పించారు. అడవులకు అగ్ని ప్రమాదం జరిగినప్పుడు జాగ్రత్తలు, కాపాడుకునేందుకు చర్యలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ కిరణ్, బీట్ ఆఫీసర్ రవి, మమత, మనోహరాబాద్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ చంద్రశేఖర్, చిన్నశివునూర్ సామెల్, కమ్మరి వెంకటేశం పాల్గొన్నారు.

## 7, 8 తేదీల్లో విజయోత్సవాలు

మెదక్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : ప్రజా పాలన విజయోత్సవాలు ఘనంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ నగేశ్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో అడిషనల్ ఎస్పీ మహేందర్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. విజయోత్సవాలను 7, 8 తేదీల్లో నిర్వహించినున్న కార్యక్రమాల్లో భాగంగా వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో యాంటీ నార్కోటిక్‌పై అవగాహన, మారణాయుధాల ప్రదర్శన నిర్వహించాలన్నారు. అధికారులకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. మత్తు పదార్థాల నిర్మూలన, సాంస్కృతిక కార్యక్రమాలు, సెల్ఫీ పాయింట్, అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు, కుల సంఘాల కళాకారులు హాజరు కావడం, సాంస్కృతిక ప్రదర్శనల ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఆదేశించారు.

# అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు కృషిచేస్తా

నర్సాపూర్‌లో చిన్నారులకు బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

వెల్దుర్తి: వర్ధవానిచెర్వుతండాలో సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత
- సేవాలాల్, జగదాంబ విగ్రహాల ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే



వెల్దుర్తి: సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

నర్సాపూర్, డిసెంబర్ 5: అంగన్‌వాడీ నూతన భవన నిర్మాణాలు, వసతులకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తెలిపారు. గురువారం నర్సాపూర్‌లోని యాదవ్ ఫంక్షన్ హాల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలమేళ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు పిల్లల వినోదానికి తోడ్పడతాయన్నారు. పిల్లలు, గర్భిణులు, బాలింతల పౌష్టికాహారం అందించే విషయంలో గత ప్రభుత్వంలో అనేక పథకాలు తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, ఆర్డీవో మహిపాల్, డీడబ్ల్యూవో స్వరూపారాథోడ్, సీడీపీవో హేమభార్గవి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మధులత, మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు, మేనేజర్ మధుసూదన్, అంగన్‌వాడి టీచర్లు, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలకు ఎమ్మెల్యే హాజరు**

వెల్దుర్తి, డిసెంబర్ 5: మండలంలోని చర్లపల్లి పంచాయతీ వర్ధవాని చెర్వుతండాలో నిర్మించిన సేవాలాల్, జగదాంబ మాత ఆలయ విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలకు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి గురువారం హాజరయ్యారు. ఎమ్మెల్యే మహిళలతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్, జగదాంబమాత ఆలయాల నిర్మాణం అభినందనీయమన్నారు. అనంతరం మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఎమ్మెల్యే వెంట పార్టీ మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, నాయకులు అశోక్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, శేఖర్, పాండురంగం, ప్రభాకర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి ఉన్నారు.

# మాజీమంత్రి హరీశ్‌రావు అరెస్టు అక్రమం

నిజాంపేట: నందిగామలో మాట్లాడుతున్న నాయకులు

చిన్నశంకరంపేట, డిసెంబర్ 5: మాజీ మంత్రి హరీశ్‌రావు అరెస్టును బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏకే గంగాధర్‌రావు ఖండించారు. హరీశ్‌రావు అరెస్టు హేమమైన చర్యగా తెలిపారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు.

**అక్రమ కేసులకు భయపడేదిలేదు**

చిలిపిచెడ్, డిసెంబర్ 5: మాజీ మంత్రి హరీశ్‌రావు అక్రమ కేసులకు భయపడే నాయకుడు కాదని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అశోక్‌రెడ్డి అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హరీశ్‌రావుపై లేనిపోని ఆరోపణలతో తప్పుడు కేసులు పెట్టాలని చూడడం సిగ్గుచేటన్నారు. ఆధారాలు లేని ఆరోపణలు చేస్తే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు చూస్తూ ఉండరన్నారు.

**మాజీ మంత్రి అరెస్టు పిరికి పంద చర్య**

నిజాంపేట, డిసెంబర్ 5: ప్రజల తరపున పోరాడుతున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును అరెస్ట్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ పిరికిపంద చర్య అని నందిగామ బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. సమావేశంలో మాజీ సర్పంచ్ సంగుస్వామి, మాజీ ఎంపీపీ బిజ్జు సంపత్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు బాజ తిరుమల్, ఆకుల రాములు, కృష్ణగౌడ్ ఉన్నారు.

ఏకే గంగాధర్‌రావు

అశోక్‌రెడ్డి

# రూ.18.19 కోట్లతో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు

**- ట్రాన్స్‌కో ఎస్ఈ శంకర్**

మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఎస్ఈ శంకర్

మెదక్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): మెరుగైన విద్యుత్ సరఫరా కోసం జిల్లాలో రూ.18.19 కోట్ల వ్యయంతో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ ఎ.శంకర్ తెలిపారు. గురువారం టెక్నికల్ డీఈ శ్రీనివాస్ విజయ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, అదనపు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, 33/11 కేవీ లైన్స్ ఇంప్రూమెంట్ పనులు చేయడానికి నిధులు మంజూరైనందున రెండు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే సీఎండీ లక్ష్యమన్నారు. జిల్లాలో 3,52,386 విద్యుత్ కనెక్షన్లున్నట్లు తెలిపారు. ఇందులో ప్రభుత్వం ప్రకటించిన గృహజ్యోతి పథకంలో భాగంగా జిల్లాలో 200 యూనిట్ల లోపు 1,25,939 మంది వినియోగదారులకు రూ.31.36 కోట్ల విలువైన సబ్సిడీ కింద మార్చి నుంచి ఇస్తున్నామన్నారు. ఇంకా అర్హులైన వినియోగదారులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 3,350 మంది నాయీ బ్రాహ్మణులు, రజకులకు మూడు కోట్ల 22 లక్ష రూపాయల సబ్సిడీ అందజేస్తున్నట్లు తెలిపారు. లక్షా 3 వేల 519 వ్యవసాయ కనెక్షన్లకు 92 కోట్ల 72 లక్షల రూపాయల సబ్సిడీ ఇచ్చినట్లు వివరించారు. 19,765 మంది ఎస్సీ, ఎస్టీలకు 100 యూనిట్లలోపు మూడు కోట్ల 15 లక్షల రూపాయలు సబ్సిడీ కింద వెచ్చించామన్నారు. జిల్లాలో 8 కొత్త సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయన్నారు. ఇందులో చల్మెడ, బాలానగర్, మెదక్ పట్టణం, వెంకటాయపల్లి, చందూర్, మహమ్మద్ నగర్, మిర్జాపల్లి, గొల్లపల్లి ఉన్నాయని వివరించారు.

**నేడు వినియోగదారుల సమావేశం**

మెదక్ విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో వినియోగదారులతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎస్ఈ శంకర్ తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి నాలుగు గంటల వరకు నిర్వహించే ఈ సమావేశంలో విద్యుత్ వినియోగదారులు తమ కున్న సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. పెండింగ్ సమస్యలున్నా తమ దృష్టికి తేవాలన్నారు.

# సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచాలి

పెద్దశంకరంపేట: శివాయపల్లిలో మట్టి నమూనాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

వెల్దుర్తిలో మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పిస్తున్న ఏవో ఝాన్సీ

నిజాంపేట, డిసెంబర్ 5: వ్యవసాయ క్షేత్రాల్లో పంటలకు రసాయన ఎరువుల వాడకం తగ్గిస్తూ, సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచాలని ఏవో సోమలింగారెడ్డి అన్నారు. గురువారం నిజాంపేట రైతువేదికలో 'ప్రపంచ నేల దినోత్సవం'పై రైతులతో సమావేశం ఏర్పాటుచేశారు. ప్రకృతి వ్యవసాయం, వానపాముల నుంచి వచ్చే వర్మీ కంపోస్టుతో వ్యవసాయం చేయడం వల్ల నేల ఆరోగ్యస్థితి బాగుండి అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు శ్రీలత, రాజు, రైతులు ఉన్నారు.

**పెద్దశంకరంపేటలో..**

పెద్దశంకరంపేట, డిసెంబర్ 5: పెద్దశంకరంపేట మండలం వీరోజిపల్లి గ్రామంలో రైతుల పంట పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి కృష్ణ ఆధ్వర్యంలో మట్టి నమూనాల సేకరించారు. ఏఈవోలు అఖిల్ హుస్సేన్, వినీత్, మమత ఉన్నారు.

**ప్రపంచ మృత్తిక దినోత్సవం**

చిలిపిచెడ్, డిసెంబర్ 5: ప్రపంచ మృత్తిక దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని రైతు వేదికలో మండల వ్యవసాయాధికారి రాజశేఖర్‌గౌడ్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో భూపాల్, రైతులు పాల్గొన్నారు.

**నేలల రకాలపై అవగాహన**

నర్సాపూర్, డిసెంబర్ 5: నర్సాపూర్‌లోని రైతువేదికలో ప్రపంచ మృత్తిక దినోత్సవం సందర్భంగా రైతులకు నేలల రకాలపై ఏడీఏ సంధ్యారాణి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. నేలల రకాలు, వాటి స్వభావం, నేలలో సహజ సూక్ష్మ జీవుల సంరక్షణ, సేంద్రియ ఎరువుల వాడకం నేల పరిరక్షణ గురించి మట్టిన సేకరించే విధానం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో చంద్రవేణి, రవివర్మ, రైతులు ఉన్నారు.

**శివ్వంపేటలో..**

శివ్వంపేట, డిసెంబర్ 5: మండలంలోని పలు క్లస్టర్ల రైతులకు మండల వ్యవసాయాధికారిని లావణ్య ఆధ్వర్యంలో నేల సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవోలు సుభాష్, మౌనిక, వెన్నెల, భువనేశ్వరి, రైతులు ఉన్నారు.

**జీవన ఎరువులు, పంటల మార్పిడీ లాభదాయకం**

వెల్దుర్తి, డిసెంబర్ 5: జీవన ఎరువులు వాడడంతో పాటు పంటల మార్పిడీతో భూమి సారవంతంగా మారి అధిక లాభాలు పొందవచ్చని వెల్దుర్తి, మాసాయిపేట మండలాల ఏవోలు ఝాన్సీ, రామ్‌శివరావు సూచించారు. రైతువేదికల్లో జీవన, సేంద్రియ ఎరువులు, పంటల మార్పిడి, మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవోలు మాజీద్, వందన, గౌతమి, రేవతి, రజిత పాల్గొన్నారు.

**ప్రపంచ మృత్తిక దినోత్సవంపై అవగాహన**

రామాయంపేట, డిసెంబర్ 5: రైతులు భూసార పరీక్షలు చేసుకోవాలని డివిజన్ వ్యవసాయశాఖ ఇన్‌చార్జి అధికారి రాజ్‌నారాయణ అన్నారు. రామాయంపేట, కాట్రియాల, అక్కన్నపేట, రాయిలాపూర్‌లో రైతులకు నేల సంరక్షణ, నేల ఆరోగ్య, భూసార సంరక్షణపై అవగాహన కల్పించారు. ఏఈవోలు సాయికృష్ణ, ప్రవీణ్, శ్రీనివాస్, సందీప్ రైతులు పాల్గొన్నారు.

# కమ్మేసిన పొగమంచు

- పొగమంచు కప్పుకోవడంతో కనిపించని గ్రామాలు
- ఉదయం పది గంటలు దాటినా ఇబ్బందులు పడ్డ జనం

రామాయంపేట పట్టణాన్ని ముంచెత్తిన పొగమంచుతో ఇబ్బందులు పడుతున్న జనం

పొగమంచుతో కనిపించని రామాయంపేట మండలంలోని పల్లె ప్రాంతాలు

నిజాంపేటలో కురుస్తున్న పొగమంచు

రామాయంపేట/ నిజాంపేట, డిసెంబర్ 5: రామాయంపేట, నిజాంపేట మండలాల వ్యాప్తంగా గురువారం విపరీతమైన పొగమంచు కురిసింది. పొగమంచు కారణంగా వాహనదారులు హెడ్‌లైట్లు వేసుకుని ప్రయాణం కొనసాగించారు.తగ్గు ముఖం పట్టిన ఉష్ణోగ్రతలతో చలి ప్రభావం రోజురోజుకు పెరుగుతున్నది. ఉదయం 8 గంటల వరకు భానుడి జాడ కనిపించలేదు. చిన్నారులు, వృద్ధులు ఉదయం, సాయంత్రం వేళలో బయటకు రావొద్దని వైద్యులు సూచిస్తున్నారు. పల్లెలన్నీ పొగమంచుతోనే కప్పేయబడుతున్నాయి. దీంతో ఉదయం పది గంటల వరకు గ్రామాలన్ని నిశ్శబ్ద వాతావరణంతో ఉంటున్నాయి. జాతీయ రహదారిపై నడిచే వాహనాలు మంచు దుప్పటితో ఎక్కడి వాహనాలను అక్కడే నిలిపేస్తున్నారు. పొగమంచు కారణంగా జనం ఇంటి బయటకు రాలేకపోతున్నారు.

**సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు**

పొగమంచుతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని, చిన్నలు, పెద్దలు జాగ్రత్తలు వహించాలని రామాయంపేట ప్రభుత్వ వైద్యుడు లింబాద్రి పేర్కొన్నారు. పొగ మంచు తోరోగాల బారిన పడే అవకావం ఎక్కువ ఉందన్నారు. ఇళ్ల లోనే మంటలు కాచుకుని ఉండాలన్నారు.సూర్యుడు ఉదయించిన తర్వాతే బయట ప్రాంతాలకు రావాలన్నారు.మంచు మూలంగా జ్వరాలు, దగ్గు, దమ్ము, జలుబు, కాళ్ల నొప్పులు వచ్చే అవకాపం ఉంటుందన్నారు.

## విద్యార్థులకు బెల్లం అంబలి పంపిణీ

నిజాంపేట, డిసెంబర్ 5: మండలంలోని నందగోకుల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారంగా బెల్లం, అంబలిని పంపిణీ చేస్తున్నట్లు హెచ్ఎం శ్రీకాంత్ తెలిపారు. విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించడంతో దృఢంగా తయారవుతారన్నారు. ఉపాధ్యాయులు గణేశ్, దశరథం ఉన్నారు.

## కేజీబీవీ విద్యార్థినికి తీవ్రగాయాలు

రామాయంపేట, డిసెంబర్ 5: మెట్లపై నుంచి విద్యార్థిని జారిపడిన ఘటన రామాయంపేట కేజీబీవీలో బుధవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. విద్యార్థిని రేణుక కేజీబీవీలో పదో తరగతి చదువుతున్నది. భవనం పైనుంచి బట్టలు తీసుకుని వస్తుండగా మెట్లపై జారి కింద పడింది. దీంతో కాలు విరిగింది. సిబ్బంది వెంటనే రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు, పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటనే హైదరాబాద్ గాంధీ దవాఖానకు మెరుగైన చికిత్స కోసం తరలించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రజినీకుమారి, ఎస్సై బాలరాజు గురువారం కేజీబీవీకి వెళ్లి విచారణ జరిపి, ప్రిన్సిపాల్ అనురాధ, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## బైక్ ఢీకొని యువకుడు, గొర్రె మృతి

వెల్దుర్తి, డిసెంబర్ 5: వేగంగా వచ్చిన బైక్ రోడ్డును దాటుతున్న గొర్రెను ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న యువకుడితో పాటు గొర్రె మృతి చెందిన ఘటన మండలంలోని చర్లపల్లి పంచాయతీ వర్ధవానిచెర్వు తండా సమీపంలో గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. శివ్వంపేట మండలం పాంబండ గ్రామానికి చెందిన మానూక రాజు (30) బైక్‌పై వెల్దుర్తి నుంచి పాంబండకు వెళ్తున్నాడు. రోడ్డు దాటుతున్న గొర్రెను అతివేగంతో ఢీకొట్టడంతో బైక్‌పై నుంచి కిందపడిన రాజు తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ ఢీకొన్న గొర్రె కూడా అక్కడికక్కడే చనిపోయింది. విషయం తెలుసుకున్న రాజు కుటుంబసభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడికి భార్య నవనీత, తల్లి ఎల్లమ్మ ఉన్నారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

రామాయంపేట, డిసెంబర్ 5: జాతీయ లోక్ అదాలత్‌ను ఈనెల 14న నిర్వహించనున్నట్లు సీఐ వెంకటరాజగౌడ్ అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ రామాయంపేట సర్కిల్‌లోని జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## ఆర్థిక సాయం అందజేత

చిన్నశంకరంపేట, డిసెంబర్ 5: టి.మాందాపూర్ తండాకు చెందిన కవిత అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న లీలా స్వచ్ఛంధ సంస్థ చైర్మన్ డాక్టర్ మోహన్ బాధిత కుటుంబానికి రూ.5వేలు అందజేశారు. నరేశ్, రవి, కిషన్, శేఖర్ పాల్గొన్నారు.

## వర్గీకరణ చేకుండా నియామకాలు చేయొద్దు

చిలిపిచెడ్, డిసెంబర్ 5: ఎస్సీ వర్గీకరణ చేయకుండా ఉద్యోగ నియామకాలు చేయవద్దని రాష్ట్ర ప్రభుత్వానికి ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు పుర ప్రభాకర్ కోరారు. గురువారం చిలిపిచెడ్‌లో బైక్ ర్యాలీ తీసి, డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. ప్రభుత్వం వెంటనే అంబేద్కర్ అభయ హస్తం నిధులు విడుదల చేయాలన్నారు. డప్పు, చెప్పు వృత్తిదారులకు రూ.4 వేల పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జనవరి 19న మాదిగల మహాగర్జనను విజయవంతం చేయాలని పిలుపునించారు. కార్యక్రమంలో నాయకులు సంజీవులు, రమేశ్, కృష్ణ, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవార్లకు బోనాలు

చిలిపిచెడ్, డిసెంబర్ 5: మండలంలోని రాందాస్‌గూడలో దుర్గమ్మ, పోచమ్మ, ఎల్లమ్మతల్లికి గురువారం గ్రామస్తులు బోనాలు సమర్పించారు. గ్రామంలో ప్రధాన వీధుల గుండా పోతురాజుల విన్యాసాలతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.